సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 9 । మే । 2024



చెప్పాడంటే.. చేస్తాడంతే!

సాయం చేసిన వారిని గుండెల్లో పెట్టుకుంటారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఐదేళ్లలో చక్కని పాలన అందించిన సీఎం జగన్‌ను జనం మెచ్చుకుంటున్నారు.

10లో



డెల్టాకు 3,100 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 3,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.50 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతోంది.

గరిష్ఠం/కనిష్ఠం
36.0° / 26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	31.0	24.0
కాకినాడ	36.5	24.4
అమలాపురం	36.0	26.0

న్యూస్‌రీల్

ఓటు అత్యంత కీలకం

అమలాపురం రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా అన్నారు. ఓటు హక్కు అమలుపై బుధవారం అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.పోలింగ్‌కు ముందు రోజే సిబ్బందితో పీవో సమావేశం పెట్టుకుని, వారికి విధులు కేటాయించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటలకు కనీసం ఇద్దరు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించవచ్చునన్నారు.

కూటమితో రాష్ట్రానికి ముప్పు



గిడుగు రుద్రరాజు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో నోటా కంటే తక్కువ ఓట్లు ఉన్న బీజేపీకి పొత్తులో భాగంగా చంద్రబాబు ఆరు ఎంపీ సీట్లు ఇవ్వడాన్ని చూస్తుంటే, ఈసారి ఎలాగైనా గద్దె ఎక్కాలన్న ఆయన రాజకీయ స్వార్థం స్పష్టమవుతోందని ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు విమర్శించారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ పాలనతో, రాష్ట్రంలో కూటమితో దేశానికే కాదు మన రాష్ట్రానికి కూడా ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్ తమ రాజకీయ భవిష్యత్తు కోసం గతిలేక ఎన్‌డీఏ కూటమితో జత కట్టారన్నారు. గతంలో బీజేపీని, ప్రధాన మంత్రి మోదీని ఎన్నో రకాలుగా ఆడిపోసుకున్న వారిద్దరూ.. ఇప్పుడు పొగడ్తలతో ఐక్యతా రాగం పాడుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన హామీలన్నీ నెరవేర్చడం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో అమలాపురం ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల సుభాషిణి, పార్టీ నాయకులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబీ పాల్గొన్నారు.

ఒకరి వెంట మరొకరు..



- అమలాపురంలో టీడీపీని వీడుతున్న కీలక నేతలు
- అదే బాటలో జనసేన నాయకులు
- స్పందించని రెండు పార్టీల అధిష్ఠానాలు

సాక్షి అమలాపురం: అమలాపురం అసెంబ్లీ పరిధిలో మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలలో సీనియర్లకు, కొన్ని సామాజికవర్గాల వారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. చివరకు పార్టీలను వీడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అనుమానంతో అడుగడుగునా వేధింపులకు గురి చేయడంతో వారందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆ పార్టీల అధిష్ఠానాలు స్పందించకపోవడం దారుణం. జనసేనకు ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో ఆ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జులు డీఎంఆర్ శేఖర్, శెట్టిబత్తుల రాజబాబు పార్టీని వీడారు. వీరితో పాటు పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్ వెళ్లిపోయింది. వీరంతా వైఎస్సార్ సీపీలో చేరారు. ఇప్పుడు టీడీపీ నాయకులు పార్టీకి రాజీనామాలు చేస్తున్నారు. ప్రధానంగా కాపు సామాజికవర్గానికి చెందినవారు టీడీపీని వీడుతుండడం గమనార్హం. నాయకులే కాదు, వందలాది మంది పార్టీల కార్యకర్తలు సైతం ఆ రెండు పార్టీలకు గుడ్‌బై చెబుతున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు పరమట శ్యామ్ రెబల్‌గా పోటీలో నిలబడిన విషయం తెలిసిందే. వీరితో పాటు పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. పార్టీ సీనియర్ నేత, మాజీ హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప సోదరుడు జగ్గయ్యనాయుడు ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. టీడీపీ రెబల్ అభ్యర్థి శ్యామ్‌కు జగ్గయ్యనాయుడు మద్దతు ఉందని టీడీపీ అభ్యర్థి ఆనందరావు మద్దతుదారులు బహిరంగంగా ఆరోపిస్తుండడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. జనసేన, టీడీపీలను వీడుతున్నవారిలో కాపు సామాజికవర్గం వారు అధికంగా ఉండడం విశేషం. జనసేనతో భవిష్యత్ లేదని తేలిపోవడంతోపాటు టీడీపీలో గుర్తింపు కరువవడంతో వారు పార్టీని వీడిపోతున్నారు. పార్టీ జిల్లా అధిష్ఠానం కలుగజేసుకుంటుందా? అంటే అదీ లేదు. జనసేన పార్టీకి జిల్లాలో ఒక యంత్రాంగం అంటూ లేదు. టీడీపీలో తగువులు తీర్చాల్సిన నేతలు గొడవలు పెడుతుండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక వారు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో టీడీపీ, జనసేనల్లో వలసలు ఆగకపోవడంతో ఆ ప్రభావం ఫలితంపై పడుతోందని రాజకీయ విశ్లేషకుల భావన.

హేళన చేశారు

ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి టీడీపీలో ఉన్నాను. ఇప్పుడు నియోజకవర్గ పెద్దలు నన్ను పట్టించుకోవడం లేదు. పైగా నా సామాజికవర్గాన్ని కించపరుస్తూ హేళన చేశారు. ఇప్పటికి నాలుగుసార్లు పోటీ చేశారు. మీరు ఒకసారి మాత్రమే గెలిచారు. ఈసారి అల్లవరం నుంచి అవకాశం ఇవ్వాలని పార్టీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావును కోరితే మమ్మల్ని పక్కన బెట్టారు.

– అడపా కృష్ణ ప్రసాద్, అల్లవరం మండలం. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు

ఇదేనా పార్టీ ఇచ్చే గుర్తింపు

పార్టీ సీనియర్ అనే గౌరవం లేకుండా చాలా సందర్భాలలో తక్కువ చేసి మాట్లాడుతున్నారు. పార్టీ నాయకులు మమ్మల్ని అడుగడుగునా అవహేళన చేస్తున్నారు. ఇదేనా పార్టీ మాకు ఇచ్చే గుర్తింపు. పార్టీ బాధ్యులే వర్గాలు కడుతున్నారు.

– లింగోలు వెంకన్న (పెదకాపు), జనుపల్లి మాజీ సర్పంచ్, ఆత్మ మాజీ చైర్మన్, టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

పార్టీలో ఎంతోమంది సీట్లు ఆశిస్తారు. వారంతా మమ్మల్ని కలిసి మద్దతు కోరతారు. అంతమాత్రాన మాకు వర్గాలు కడతారా? మా కుటుంబం టీడీపీ విజయానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంటే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అందుకే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను.

– నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, మాజీ హోం మంత్రి చినరాజప్ప సోదరుడు

పట్టించుకోవడం లేదు

జనసేన పార్టీ పల్లకీ మోసినా మాకు గుర్తింపు లేదు. టీడీపీ నాయకులు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. అడగడుగునా అవమానాలు ఎదురువుతున్నాయి. మా సేవలకు గుర్తింపు దక్కడం లేదు.

– మోకా బాలయోగి, మాజీ సర్పంచ్, రెళ్లుగడ్డ, అల్లవరం మండలం

టీడీపీకి మద్దతు ఇవ్వడం తప్పు

గ్రామంలో 1,200 పార్టీ సభ్యత్వాలు చేయించగా జనసేన పెద్దలు ఘనంగా సత్కరించారు. కానీ ఇప్పుడు నేనే పార్టీ వీడి వెళ్లాల్సి వస్తోంది. టీడీపీలో ఉన్నప్పుడు గుర్తింపు లేక జనసేనకు వచ్చాను. ఇప్పుడు అదే జనసేన టీడీపీకి మద్దతు ఇవ్వడం చాలా తప్పు.

– గొలకోటి వెంకటేష్, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు

అందుకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

ఐదుసార్లుగా పార్టీ టిక్కెట్ ఆశించినా నాకు అవకాశం దక్కలేదు. ఈసారి టిక్కెట్ ఇవ్వలేదు సరికదా.. అడుగడుగునా నన్ను అవమానించారు. నన్ను ఎవరో ప్రభావితం చేస్తే పోటీలో ఉన్నానని తప్పుడు ప్రచారం చేశారు. నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటాను అంటే వారి వద్ద నుంచి స్పందన లేదు. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా నేను పోటీలో ఉన్నాను.

– పరమట శ్యామ్, టీడీపీ రెబల్ అభ్యర్థి

శ్రీనిశాంత్‌కు ఫస్ట్



భూపతి శ్రీనిశాంత్
ర్యాంకు: 71 (117 మార్కులు)
స్వస్థలం: మాకనపాలెం, మామిడికుదురు మండలం
తండ్రి: భూపతి మనోహర్‌రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి: అరుణకుమారి ప్రభుత్వ ఉపాధ్యాయిని
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ చెన్నైలో సీటు

శ్రీనిహాంత్‌కు రెండో ర్యాంకు



భూపతి శ్రీనిహాంత్
ర్యాంకు: 87 (117 మార్కులు)
స్వస్థలం: మాకనపాలెం, మామిడికుదురు మండలం
తండ్రి: భూపతి మనోహర్‌రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి: అరుణకుమారి ప్రభుత్వ ఉపాధ్యాయిని
విద్యార్థి లక్ష్యం: సివిల్స్

పాలిసెట్‌లో పెరిగిన ఉత్తీర్ణత

- జిల్లాలో 87.38 శాతం సాధించిన విద్యార్థులు
- గతేడాది కంటే 1.87 శాతం పెరుగుదల
- బాలికలదే పైచేయి

రాయవరం: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 87.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 27న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 4,271 మంది హాజరు కాగా, బుధవారం ప్రకటించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 3,732 మంది పాసయ్యారు. గతేడాది కంటే పాలిసెట్ ఉత్తీర్ణతలో 1.87 శాతం మెరుగుదల కన్పించింది. ఈ ఏడాది ప్రవేశ పరీక్షకు 2,515 మంది బాలురు హాజరు కాగా, 86.08 శాతంతో 2,165 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల్లో 1,756 మంది పరీక్షకు హాజరై 89.24 శాతంతో 1,567 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదిలా ఉంటే జిల్లాలో ప్రవేశ పరీక్షకు 4,637 మంది రిజిస్టర్ చేసుకోగా, 4,271 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన భూపతి శ్రీనిషాంత్ 117 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకు, భూపతి శ్రీనిహాంత్ 117 మార్కులు సాధించి 87వ ర్యాంకు, మండపేట విజయలక్ష్మినగర్‌కు చెందిన మార్ని కృష్ణ శ్రీకృతి 115 మార్కులతో 148వ ర్యాంకును సాధించారు. వీరు జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

మూడో ర్యాంకర్ కృష్ణ శ్రీకృతి



మార్ని కృష్ణశ్రీకృతి
ర్యాంకు: 148 (115 మార్కులు)
స్వస్థలం: మండపేట
తండ్రి: వెంకన్న చౌదరి (లేటు)
తల్లి: జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయిని
విద్యార్థి లక్ష్యం: ఐఐటీలో సీటు సాధించడం

సంతృప్తినిచ్చాయి



పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు సంతృప్తినిచ్చాయి. గత విద్యా సంవత్సరంతో ప్రవేశ పరీక్షా ఫలితాలతో పోలిస్తే ప్రస్తుతం 1.87 శాతం ఉత్తీర్ణత పెరిగింది. త్వరలోనే కౌన్సెలింగ్ తేదీలను తెలియజేస్తారు. దాని ప్రకారం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

– డాక్టర్ సముద్రాల రామారావు, జిల్లా కోఆర్డినేటర్, పాలిసెట్ ప్రవేశ పరీక్ష

సాగుపరంగా.. పారిశ్రామికంగా ..

ఆర్థిక ఖిల్లాగా మండపేట

- తాపేశ్వరం కాజా ప్రత్యేకత
- పౌల్ట్రీ, రైసుమిల్లులతో ఆర్థిక పరిపుష్టి



మండపేటలోని కలువ పువ్వు సెంటర్

కపిలేశ్వరపురం: పామర్రు నియోజకవర్గంలోని ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలను, అనపర్తి నియోజకవర్గంలోని మండపేట మండలాన్ని కలిపి 1978లో ఆలమూరు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలతో మండపేట నియోజకవర్గం ఏర్పాటైంది. ఆలమూరు నియోజకవర్గం నుంచి 1978 తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డి జనతా అభ్యర్థి ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావుపై విజయం సాధించారు. 1983, 85లలో వల్లూరి నారాయణరావు (టీడీపీ), 1989లో సంగిత వెంకటరెడ్డి (కాంగ్రెస్), 1994, 99లో వీవీఎస్ఎస్ చౌదరి(టీడీపీ), 2004లో డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి (కాంగ్రెస్) ఎన్నికయారు. మండపేట నియోజకవర్గం ఏర్పాటు అయ్యాక తొలి ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్నికయ్యారు. 2009, 2014, 2019లలో ఆయన వరుస విజయాలను దక్కించుకున్నారు.

మండపేటకు చారిత్రక నేపథ్యం

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం మండపేట పంచాయతీ ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. 1946లో వచ్చిన ఫిర్కా వ్యవస్థలో నేలటూరు, ఏడిద, తాపేశ్వరం గ్రామాలను కలుపుకొని మండపేట ఫిర్కా ఏర్పడింది. ఆయా కాలాల్లో వేగుళ్ల నారయ్య, వేగుళ్ల రామన్న, రెడ్డి శ్రీరాములు, వల్లూరి పాపారాయుడు, నూని సోమరాజులు, మెర్ల వెంకటరాజు (కొండయ్య)లు ప్రజాప్రతినిధులుగా సేవలందించారు. 1952లో ఫిర్కా వ్యవస్థను రద్దు చేసి మరలా పంచాయతీ వ్యవస్థను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. 1953లో మండపేట మేజర్ పంచాయతీగా ఆవిర్భవించగా తొలి సర్పంచ్‌గా వల్లూరి పనస రామన్న సేవలందించారు. అనంతరం మండపేట మున్సిపాలిటీ ఆవిర్భవించింది.

నియోజకవర్గ ప్రత్యేకతలు

ఆరు, ఏడు శతాబ్దాలలో అభయారణ్యంగా ఉండే మండపేట ప్రాంతంలో మాండవ్యముని తపస్సు చేశారని, ఆయన పేరుతోనే మాండవ్యపురంగా పిలిచేవారని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమంలో మండపేటగా ఆవిర్భవించిందని నమ్మకం. ఆంధ్రా అన్నపూర్ణగా బ్రిటిష్ వారి ప్రశంసలు అందుకున్న డొక్కా సీతమ్మ జన్మస్థలం మండపేట.

- ఎంతో ఖ్యాతిని గడించిన తాపేశ్వరం కాజా మండపేట నియోజకవర్గంలోనిదే. తెలంగాణలోని ఖైరతాబాద్, బాలాపూర్ భారీ నవరాత్ర శిబిరాల్లో వేలం వేసే లడ్డూలు ఉమ్మడి ఏపీ కాలంలో తాపేశ్వరం నుంచే సరఫరా అయ్యేవి.
- మండపేట మండలం ద్వారపూడిలో హోల్‌సేల్ వస్త్ర మార్కెట్ ఉంది. 338 షాపులున్న ఈ కాంప్లెక్స్‌లో కోల్‌కతా, చెన్నై, ముంబై, బళ్లారి, ఢిల్లీ, ఈరోడ్, సూరత్ తదితర ప్రాంతాల నుంచి క్లాత్, రెడీమేడ్ దుస్తులను తీసుకొచ్చి హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తారు.
- నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ రైసు మిల్లులు, పౌల్ట్రీలు ఉన్నాయి. 90 శాతం వరి పంట పండుతుంది. ఇతర జిల్లాల్లోని ధాన్యాన్ని ఇక్కడి మిల్లుల్లో బియ్యంగా మిల్లింగ్ చేస్తారు.

మండపేట నియోజకవర్గ భౌగోళిక స్వరూపం

మున్సిపాలిటీ	01 (వార్డులు 30)
మండలాలు	03
గ్రామాలు	43
సచివాలయాలు	76

ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
మండపేట అర్బన్	23,149	25,677	--	48,826
మండపేట రూరల్	31,303	33,142	04	64,449
కపిలేశ్వరపురం	26,855	27,200	--	54,055
రాయవరం	25,872	27,205	02	53,079
మొత్తం	1,07,179	1,13,224	06	2,20,409

2019 జూన్ నుంచి 2023 జూన్ వరకూ వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూపాయల్లో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	50,053	527,15,60,500
జగనన్న అమ్మఒడి	25,346	110,15,25,374
వైఎస్సార్ చేయూత	15,266	69,48,83,773
వైఎస్సార్ ఆసరా	49,039	151,28,09,113
వైఎస్సార్ రైతు భరోసా	25,256	107,64,08,673
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎఎ)	20,872	4,50,91,356
వైఎస్సార్ కాపు నేస్తం	5,644	31,06,21,268
ఉచిత పంటల బీమా	12,586	39,67,33,690
జగనన్న విద్యా దీవెన	13,736	48,53,23,686
జగనన్న వసతి దీవెన	10,677	2,309,73,321
వైఎస్సార్ నేతన్న నేస్తం	415	3,24,76,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3,233	9.19,07,131
వైఎస్సార్ బీమా	6,64	11,16,25,000
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	10,417	10,45,79,281
వైఎస్సార్ వాహన మిత్ర	1,099	3,47,10,000
సున్నా వడ్డీ పంట రుణాలు	20,321	77,794
జగనన్న చేదోడు	3,925	4,61,95,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	10,766	43,54,08,779
కోవిడ్ సాయం	41,025	4,09,91,739
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	4,992	6,53,01,439
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1,321	12,05,48,250
వైఎస్సార్ కల్యాణమస్తు, షాది తోఫా	278	1,27,08,004
అర్చకులు, ఇమాంలు, పాస్టర్లకు సాయం	29	2,00,000
జగనన్న విదేశీ విద్యా దీవెన	913	4,56,22,050
జగనన్న తోడు	2,062	8,89,892
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	8,032	15,93,73,692
జగనన్న విద్యా కానుక	5,949	19,07,30,366
ఇళ్ల స్థలాలు (భూసేకరణ, పరిహారం చెల్లింపు)	4,684	93,05,85,621
ట్యాబ్‌ల పంపిణీ	1,079	1,58,72,847
ఇతరములు	171	1,77,25,680
మొత్తం	3,49,850	1358,34,59,319

క్లుప్తంగా

వస్త్ర దుకాణంలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తుని: స్థానిక పెంటకోట రోడ్డులోని పుష్పాంజలి వస్త్ర, రెడీమేడ్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో షాపు యాజమాని రెడ్డి సూరిబాబు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో షాపులో పనిచేస్తున్న సిబ్బంది భోజనానికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారి రాముడు మాట్లాడుతూ మూడు గంటల పాటు శ్రమిస్తే మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. భారీగా నష్టం జరిగిందని భావిస్తున్నామన్నారు.

వైభవంగా తలుపులమ్మ జాతర



ఆకట్టుకున్న కేరళ బృందం ప్రదర్శన

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. 13 రోజులు జరిగిన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా లోవదేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో లోవకొత్తూరు గ్రామంలో వివిధ సాంఘిక, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వి.కొత్తూరు, కుమ్మరిలోవ, రాజుపేట, మర్లపాడు, సీత్యపేట, కొత్త వెలంపేట, వెలంపేట కాలనీ, జగన్నాథగిరి గ్రామాల్లో ఉత్సాహంగా జాతరలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లతో ఉత్సవాలను భారీగా నిర్వహించారు.

ప్రతిభ ఉంటే.. ఉపకారం మీ వెంటే

- విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్ షిప్స్
- జూన్ 7 వరకు దరఖాస్తుకు గడువు



రాయవరం: చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద 6,500 మందికి పైగా ఆర్థిక సహాయం, 27,600 మంది వరకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు రెండేళ్ల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ ఉపకార వేతనం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా భవిష్యత్‌కు అవసరమైన దిశానిర్దేశం చేస్తారు.

విద్యార్థుల అర్హతలు

సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం పొందాలంటే ఆ విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదిలో కనీసం 90 శాతం మార్కులు సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు రావాలి.

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూన్ 23న దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

Vidyadhan
Transforming lives through education
A Shibulal Family Philanthropic Initiative

జూన్ 7వ తేదీ వరకూ గడువు

విద్యాదాన్ ఉపకార వేతనం కోసం జూన్ 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, చదువుతున్న కళాశాల వివరాలను పొందుపర్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా సొంత ఈ మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్, ఇతరుల ఈ మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని, దాని పాస్‌వర్డ్ గుర్తుంచుకోవాలి. మరిన్ని వివరాల కోసం సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విద్యాదాన్.ఆంధ్రఃఎస్‌డీ ఫౌండేషన్ఇండియా.కామ్ సంప్రదించాలి. లేదా 96635 17131 నంబర్‌లో సంప్రదించవచ్చు.

దరఖాస్తు చేసుకునే విధానం

- విద్యార్థులు ప్లేస్టోర్‌లోని విద్యాదాన్ యాప్, లేదా విద్యాదాన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదో తరగతి మార్కుల జాబితాల ప్రకారం మీ పేరులో మొదటి పేరును ఎంటర్ చేయాలి. తర్వాత రెండో పేరును నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి సొంత చిరునామాను నమోదు చేయాలి.
- అనంతరం అప్లయ్ నౌ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే మీ ఈ మెయిల్‌కు మీ అకౌంట్ యాక్టివేషన్ కోసం లింక్ వస్తుంది. యాక్టివేషన్ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజీలో అకౌంట్ యాక్టివేటెడ్ అనే మెసేజ్ కనిపిస్తుంది.
- ఈ మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయితే స్టెప్-2లోకి వెళతారు. లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, దాని ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. అప్లికేషన్ పూర్తి చేసిన తర్వాత ఎడిట్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్‌ను ఎడిట్ చేసుకోవచ్చు.
- ఎంటర్ చేసిన తర్వాత సబ్మిట్‌పై క్లిక్ చేయాలి. సబ్మిషన్ సక్సెస్‌ఫుల్ అని చూపిస్తుంది. డాక్యుమెంట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తును అంగీకరిస్తారు.
- విద్యార్థులు ఎప్పటికప్పుడు ఈ మెయిల్‌ను చెక్ చేసుకోవాలి. ఎస్‌డీఎఫ్ ప్రతి సమాచారాన్ని ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తుంది.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి మొదట విడత అడ్మిషన్లకు పదో తరగతి, ఆపై అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఆసక్తి కలవారు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో గురువారం నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకుని రశీదు పొందాలన్నారు. వారందరికీ ఈ నెల 10 నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 92940 50231 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఆధ్వర్యంలో ఈసెట్-24 ఆన్‌లైన్ పరీక్షను బుధవారం కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాలలో బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 2,140 మంది దరఖాస్తు చేసుకోగా 2,094 మంది హాజరయ్యారు. కాకినాడ అచ్యుతాపురం అయాన్ ఆన్‌లైన్ కేంద్రంతో పాటు సూరంపాలెం ప్రగతి, ఆదిత్య కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని కన్వీనర్ భానుమూర్తి తెలిపారు.

అర్ధరాత్రి పచ్చమూకల బరి తెగింపు

- హోంమంత్రి బస చేసిన ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి
- 14 బైక్‌లు ధ్వంసం, ఆరుగురికి గాయాలు
- సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారాలతో పోలీసులకు మంత్రి వనిత ఫిర్యాదు



విలేకర్లతో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత



దాడిలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ పార్టీ అభ్యర్థులకు లభిస్తున్న ప్రజాదరణను చూసి పచ్చమూకలు తట్టుకోలేకపోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతూ బరితెగించి దాడులకు పాల్పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నికల ప్రచారం అనంతరం నల్లజర్లలో హోంమంత్రి తానేటి వనిత బస చేసిన వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటిపై మంగళవారం అర్ధరాత్రి టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, గోపాలపురం టీడీపీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుతో సహ దాదాపు 30 నుంచి 40 మంది దాడి చేశారు. ఇనుపరాడ్లు, సర్వే కర్రలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. హోంమంత్రి ఉన్న గది తలుపులను పగులగొట్టడానికి విఫలయత్నం చేశారు. మరో రెండు గదుల తలుపులు పగులగొట్టారు. 14 బైక్‌లతో పాటు కుర్చీలు, ఫర్నిచర్, డీజే వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో స్థానిక పోలీసు అధికారులు అక్కడే ఉన్నా టీడీపీ వర్గీయులను నిలవరించలేకపోయారు. టీడీపీ వర్గీయుల దాడిలో వల్లూరి శేషగిరిరావు, ముత్తిన నరేష్, ఏపూరి క్రాంతి, రాయుడు గంగాధరరావు, ఆలపాటి రాంభాస్కరరావు, పాతూరి సత్యనారాయణ గాయపడ్డారు. దీనిపై తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీసీ ఫుటేజ్‌ల ఆధారాలతో మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకులకు ఓటమి భయం: మంత్రి వనిత

హోంమంత్రి తానేటి వనిత విలేకరులతో మాట్లాడుతూ ఒక దళిత మహిళ హోంమంత్రిగా ఉండటం, రాబోయే ఓటమిని జీర్ణించుకోలేక పోవడం, నల్లజర్లలో పెద్దెత్తున ర్యాలీ, ఎన్నికల ప్రచారం జరగడం తట్టుకోలేక తనపైనా, తమ కార్యకర్తలపైనా, నాయకులపైనా టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారన్నారు. వీళ్లచేసే అరాచకాలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నమో లేదో అర్థం కావడం లేదన్నారు. నిర్దిష్ట సమయానికి ప్రచారం ఆపి, మా నాయకుడి ఇంట్లో బస చేస్తే, దౌర్జన్యం చేయటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. సెక్యూరిటీ రక్షణగా ఉండటంతో తాను ప్రాణాలతో బయట పడ్డానన్నారు. ఎన్నికల బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి కూడా దాడికి రావడం చూస్తుంటే వారిలోని ఓటమి భయం బహిర్గతమైందన్నారు. కాగా.. ఈ ఘటనపై నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని సూచించారు.

8 మంది టీడీపీ నాయకులపై కేసు



రామారావు, డీఎస్పీ

హోంమంత్రి తానేటి వనితపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి 8 మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ రామారావు బుధవారం ఉదయం విలేకరులకు తెలిపారు. వారిలో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఉన్నారన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయన్నారు. నల్లజర్లలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ముందస్తుగా 144 సెక్షన్ విధించినట్టు చెప్పారు.



పిఠాపురంలో స్థలాలను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం తదితరులు

పిఠాపురంలో సీఎం జగన్ ఎన్నికల సభ

స్థలాలను పరిశీలించిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిఠాపురంలో ఎన్నికల ప్రచారానికి రానున్న నేపథ్యంలో సభ నిర్వహించే స్థలాలను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ తదితర ప్రాంతాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జనం భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. వాటినన్నింటినీ పరిశీలించి ఎక్కడ నిర్వహించేదీ నిర్ణయించనున్నారు. రఘురాం వెంట రాష్ట్ర భూదానం బోర్డు చైర్మన్ తాడి విజయ భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గండేపల్లి బాబీ ఉన్నారు.

10 వరకూ తత్కాల్‌లో ఇంటర్ ఫీజుకు అవకాశం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వాటికి ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులకు తత్కాల్ స్కీమ్‌లో అవకాశం ఉందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. తత్కాల్ స్కీమ్ కింద విద్యార్థులు రూ.మూడు వేలు జరిమానాగా చెల్లించాలని, ఈ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల పదో తేదీ సాయంత్రం మూడు గంటల లోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును తత్కాల్ స్కీమ్ ద్వారా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు ఆన్‌లైన్ విధానంలో చెల్లించవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి ఎల్.నరసింహం తెలిపారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు రక్షణ

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలకు రక్షణ సాధ్యమని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌ఆజం అన్నారు. స్థానిక జాంపేటలోని హబీబుల్లాఖాన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థులు మార్గాని భరత్ రామ్ (రాజమహేంద్రవరం సిటీ), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (రూరల్), జక్కంపూడి రాజా (రాజానగరం) తరఫున ఎన్నికల ప్రచారం చేసేందుకు రెండు రోజులుగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ ఒక తాటిపైకి వచ్చి జగన్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు చెందిన 50 లక్షల మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలు అందుకున్నారన్నారు. సుమారు 850 మంది పైగా పదవులు పొందారని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేనల పొత్తు అక్రమమన్నారు. బీజేపీకి ఓటువేస్తే దేశం నుంచి ముస్లింలను తరిమి వేస్తుందని హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, అప్పుడే అనేక వేల మంది ఉద్యోగాలు పొంది మంచి స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 14 ఏళ్లు పాలించినా ముస్లింలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ కూటమి పార్టీలు తోడు దొంగలని అన్నారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఆరిఫ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నిజాం, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆరిపుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.